నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 హైదరాబాద్, బుధవారం 7 ఫిబ్రవరి 2024 HYDERABAD




జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి తదితరులు

## అసెంబ్లీ ముగిసిన
# మరుసటి రోజే కౌన్సిల్!

**అఖిలపక్ష భేటీలో నిర్ణయం**

**సర్వసభ సమావేశానికి ఏర్పాట్లు చేయండి**

**అధికారులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశం**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం అసెంబ్లీ ముగిసిన మరుసటి రోజున నిర్వహించే దిశగా కసరత్తు మొదలైంది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అధ్యక్షతన కార్పొరేటర్ల అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ ఆలస్యానికి కారణాలు, ఏయే అంశాలపై చర్చ, కౌన్సిల్ మీటింగ్ తేదీ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే జీహెచ్ఎంసీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ల అఖిలపక్ష అభిప్రాయం వ్యక్తం చేసింది. దీంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను సమావేశ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు హేమ, గీతా ప్రవీణ్ ముదిరాజ్, సతీశ్, సింధూరెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు శ్రావణ్, మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు రజిత పరమేశ్వర్ రెడ్డి, విజయారెడ్డి, సీఎన్ రెడ్డి, ఎంఐఎం కార్పొరేటర్లు మీర్జా ముస్తఫా బేగ్, సయ్యద్ మింజాదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతో ఉండాలని..



సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అదనపు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ హోదాలో మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కోర్టు నిర్వహించారు. బంజారాహిల్స్‌కు చెందిన ఐదుగురు రౌడీషీటర్లను బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర కోర్టు ఎదుట హాజరుపరిచారు. సయ్యద్ మజీద్ అలియాస్ బెంగాలీ, డాక్టర్, మహ్మద్ నియముతుల్లా అలియాస్ మహ్మద్ అమీర్, టార్జన్, మిర్జా హరూన్ బేగ్ అలియాస్ మిర్జాలు బంజారాహిల్స్ ఠాణాలో రౌడీషీటర్లు. సయ్యద్ ఐజాజ్ అలియాస్ గోలి అసీఫ్‌నగర్‌లో, సయ్యద్ సాజీద్‌పై మాసబ్‌ట్యాంక్ ఠాణాలో రౌడీషీట్లు నమోదయ్యాయి. హత్యలతో పాటు వివిధ నేరాలలో నిందితులుగా ఉన్నారు. దీంతో రౌడీషీటర్లను కోర్టులో హాజరుపరిచి, సంవత్సరం వరకు సత్ప్రవర్తనతో ఉండాలని, అందుకు రూ. 50 వేల ఎగ్జిక్యూట్ బాండ్లతో పాటు ఒక్కొక్కరికి ఇద్దరు ష్యూరిటీలను తీసుకున్నారు.



## సాగునీటి హక్కుల కోసం
# కొట్లాడుడే..

**మరో ఉద్యమానికి బీఆర్ఎస్ సన్నద్ధం**

**తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

**ఉమ్మడి రంగారెడ్డి నేతలకు దిశా నిర్దేశం**

రంగారెడ్డి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం పోరాడేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తెలంగాణను సాధించి హక్కులను కాపాడుకున్న స్ఫూర్తితోనే మరో ప్రజా ఉద్యమానికి పార్టీ శ్రేణులు సన్నద్ధులు కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం కేఆర్ఎంబీ అంశంపై కేసీఆర్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు హాజరయ్యారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలకు నష్టం వాటిల్లేలా కృష్ణా ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని సమావేశంలో తీవ్రంగా ఖండించారు. ఈనెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలంటూ సమావేశంలో కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్, వివేకానంద, అరెకపూడిగాంధీ, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, పైలట్ రోహిత్ రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌లు సత్తు వెంకటరమణారెడ్డి, రాజూగౌడ్, కార్తిక్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పార్టీ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఖాకీవనంలో
# కలుపు మొక్కలు

**అవినీతి పోలీసులపై సస్పెన్షన్ వేటు**




సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ)/మియాపూర్ : అవినీతి అక్రమాలు, మహిళలతో అసభ్య ప్రవర్తన, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న పోలీసులపై పోలీసు బాస్‌లు సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. హైదరాబాద్‌లో పంజాగుట్ట ఠాణాలో 85 మంది ఒకేసారి బదిలీ కావడం, ఆ ఠాణా మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావును అరెస్ట్ చేసిన విషయం మరువకముందే సైబరాబాద్‌లో మరో ఇన్‌స్పెక్టర్‌పై వేటు పడింది. మియాపూర్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, స్టేషన్‌కు వచ్చిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి మంగళవారం సస్పెండ్ చేశారు. ట్రై కమిషనరేట్లలోని ఠాణాలలో కొందరు అధికారుల అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తుండడంతో ఆయా ఠాణాలు వార్తల్లోకి ఎక్కుతున్నాయి. అవినీతి, అక్రమాలకు అడ్డాలుగా మారిన వాటిని చక్కబెట్టేందుకు పోలీస్ కమిషనర్లు శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొంత మందిపై బదిలీ వేటు వేస్తున్న ఉన్నతాధికారులు, తమకు ఫిర్యాదులు వచ్చే వాటిపై అంతర్గతంగా విచారణ జరుపుతూ సస్పెండ్ చేస్తున్నారు.



సీఐ ప్రేమ్ కుమార్

**ఇటీవల జరిగిన ఘటనలు..**

- గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఒక సినీ నిర్మాత హత్య కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై గోపాలపురం ఏసీపీ సుధీర్, ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఎస్సై దీక్షిత్‌పై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ చర్యలు తీసుకున్నారు.
- పంజాగుట్టలో ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, ఆయనకు సహకరించిన బోధన్ మాజీ ఇన్‌స్పెక్టర్‌ను అరెస్ట్ చేసి, పంజాగుట్ట ఠాణా సిబ్బందిపై సమూల మార్పులు చేశారు..
- కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సివిల్ తగదాలో దూరి, మహిళను వేధింపులకు గురి చేశారనే ఆరోపణలపై సైబరాబాద్ సీపీ సస్పెండ్ చేశారు.
- భార్య, భర్త పంచాయితీలో తలదూర్చి బాధితుడిని చితకబాదడంతో కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్‌ను సీపీ సస్పెండ్ చేశారు.
- సివిల్ తగాదాలో తలదూర్చిన పహాడీ షరీఫ్ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌ను రాచకొండ సీపీ సుధీర్‌బాబు సస్పెండ్ చేశారు.



## డిప్యూటేషన్‌పై వచ్చి..
# బల్దియాలో తిష్ట

**బదిలీ చేసినా మాతృసంస్థకు ససేమిరా..**

**వైద్య విభాగంలో వరుస ఫిర్యాదులు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో డిప్యూటేషన్లపై నియంత్రణ కొరవడింది. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖలో కొందరు వైద్యాధికారుల వ్యవహార శైలి చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ నుంచి బల్దియా మెడికల్ విభాగానికి డిప్యూటేషన్‌పై వచ్చిన అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లు(ఏఎంఓహెచ్) ఏండ్ల తరబడి తిష్ట వేస్తున్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలోని అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లు (ఏఎంఓహెచ్) దాదాపు 17 మంది డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేస్తున్నారు. వాస్తవంగా డిప్యూటేషన్‌పై వచ్చిన వాళ్లు మూడేండ్లు మాత్రమే పనిచేయాలి. ఆ తర్వాత వీరి సేవలు కొనసాగాలంటే సచివాలయ స్థాయిలో నిర్ణయాలు జరగాలి. ఆది కూడా ఏడాది, అవసరమైతే మరో ఏడాది ..ఇలా గరిష్టంగా ఐదేండ్లు పనిచేయవచ్చు. కానీ వీరిలో కొందరు ఏండ్లుగా ఇక్కడే తిష్ట వేశారు. భార్గవ నారాయణ అనే అధికారి దాదాపు పదేండ్ల క్రితం వచ్చారు.. ఐదేండ్లకు పైగా ఖైరతాబాద్ సర్కిల్‌లో పని చేశారు. మాతృసంస్థకు పంపినా వెళ్లలేదు. దీంతో బల్దియాలోనే బదిలీతో సరి పెట్టడంతో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో పని చేస్తున్నారు. ముషీరాబాద్ సర్కిల్ ఏఎంఓహెచ్ కూడా దాదాపు ఇదే పరిస్థితి. ఇలా ఒకసారి జీహెచ్ఎంసీలో అడుగు పెడితే పొమ్మని ఆర్డర్ జారీ చేసినా వెళ్లడానికి ఆసక్తి చూపించడం లేదు. తాజాగా శేరిలింగంపల్లి సర్కిల్ 20 ఏఎంఓహెచ్ నగేశ్ నాయక్‌ను ఈ నెల 1న మాతృసంస్థకు పంపిస్తూ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. అయినా రెండు రోజులుగా నగేశ్ నాయక్ కమిషనర్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ బల్దియాలోనే కొనసాగేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఏఎంఓహెచ్‌లపై అవినీతి ఆరోపణలు ఉండడంతో రెండు రోజుల క్రితం వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యఅధికారితో పాటు కొందరు ఉద్యోగులు మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి ఫిర్యాదు చేయడం గమనార్హం.

### నేడు మంత్రి పొన్నం సమీక్ష

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ పాలన వ్యవహారాలపై బుధవారం సిటీ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షించనున్నారు. ఉదయం 11గంటలకు బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, బల్దియా కమిషనర్‌తోపాటు అధికారులు పాల్గొనున్నారు.

## నేటి నుంచి
# ఓయూలో సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6 : ఉస్మానియా యూనివర్సిటీ బోటనీ విభాగంలో బుధవారం నుంచి మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. విభాగం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సదస్సును 'అడ్వాన్సెస్ ఇన్ ప్లాంట్ సైన్సెస్ ఫర్ సస్టెయినబుల్ ఫ్యూచర్'అనే అంశంపై నిర్వహించనున్నట్లు సదస్సు కన్వీనర్లు ప్రొఫెసర్ బి.రమాదేవి, కన్వీనర్ ప్రొఫెసర్ సబితా రాణి తెలిపారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయ భవనంలోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం పది గంటలకు సదస్సు ప్రారంభం కానుందని చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ములుగు ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ డీన్, ఐఎఫ్ఎస్ అధికారి ప్రియాంక వర్గీస్ హాజరుకానున్నారని, ఇక్రిసాట్ గ్లోబల్ రీసర్చ్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ సీన్ మాయెస్ కీలకోపన్యాసం చేయనున్నారు.

## గృహజ్యోతి అర్హుల..
# గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): గృహజ్యోతి పథకంలో భాగంగా గృహ వినియోగదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలుకు అర్హులను గుర్తించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ మంగళవారం చర్యలు చేపట్టింది. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫరూఖీ నేతృత్వంలో ఉన్నతాధికారులు హైదరాబాద్ సెంట్రల్ జోన్ గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్ సెక్షన్‌లో విద్యుత్ వినియోగదారుల ఇండ్లకు వెళ్లారు. ఇంటింటికీ వెళ్లి కరెంటు మీటర్ రీడింగ్ తీసే సిబ్బందితో కలిసి విద్యుత్ వినియోగదారుల నుంచి రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు సేకరించి స్పాట్ బిల్లింగ్ మిషన్‌లో నమోదు చేయించారు. టీఎస్ఎస్పీడీసీఎల్ పరిధిలోని 9 సర్కిళ్ల పరిధిలో సుమారు 1800 మంది కరెంటు మీటర్ రీడర్లు ఉన్నారు. వీరంతా ఈ నెల 15 వరకు ఇదే పనిలో ఉంటారని, ఆ తర్వాత ప్రభుత్వ నిర్ణయం ప్రకారం అర్హులైన వారికి గృహ జ్యోతి పథకం అమలు చేస్తామని తెలిపారు.





ఉస్మానియా పోలీసుల అదుపులో ఉన్న బీఆర్ఎస్వీ నాయకులు

## ఓయూలో

# మళ్లీ నిర్బంధం

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రాక నేపథ్యం**

**బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు**



ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6 : ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగుల సమస్యలపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హాజరుకానున్న నేపథ్యంలో ఓయూలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గతంలో చీరలు, గాజులతో ఓయూ పోరాట పటిమను అవమానించిన వెంకట్‌కు ఓయూ గడ్డపై కాలు మోపే అర్హత లేదని, ఆయనను అడ్డుకుంటామని బీఆర్ఎస్వీ నాయకులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి హాస్టళ్ల నుంచి బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. నిర్బంధాలతో ఏమీ చేయలేరని, ముందస్తు అరెస్టులు చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ అభివృద్ధి ప్రధాత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. కాంగ్రెస్ పార్టీ జీవో నంబర్ 46ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం రావడంతోనే జాబ్ క్యాలెండర్ ప్రకటించినప్పటికీ, రెండు నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, నాయకులు శివ, మిథున్, నాగేందర్‌రావు, అవినాశ్ తదితరులు ఉన్నారు.



## జీవో 46పై
# స్టే ఎత్తేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ సక్రమంగా నిర్వహించేందుకు జారీ చేసిన జీవో నంబర్ 46పై స్టేను తక్షణమే ఎత్తివేయాలని విద్యార్థులు, నిరుద్యోగులు ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం గతంలో ఉద్యోగ భర్తీలో ఎవరికీ అన్యాయం జరగకుండా జీవో నంబర్ 46ను జారీ చేసిందని గుర్తు చేశారు. కానీ ఆ జీవోపై న్యాయస్థానం విధించిన స్టేను తొలగిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, స్టేను తొలగించి, ఉద్యోగ భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 10 నుంచి జరుగబోయే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకొని సామూహిక ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు.

## అవకాశవాదులే
# పోతున్నారు

**బీఆర్‌టీయూ ప్రెసిడెంట్ రాంబాబు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): అవకాశవాదులే కాంగ్రెస్ అనుబంధ సంఘాల్లో చేరుతున్నారని బీఆర్‌టీయూ ప్రెసిడెంట్ రాంబాబు అన్నారు. జలమండలి ఉద్యోగులతో ఎస్ఆర్ నగర్ యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జి.రాం బాబు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022లో గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు కేటీఆర్, కవిత, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహకారంతోఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. కానీ కొంతమంది అవకాశవాద ఉద్యోగులు కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో పీ.జరాజ్, పీ. నారాయణ, అక్తర్, జి.లక్ష్మీనారాయణ, సీ.రాజు, జి.రాంచంద్రారెడ్డి, సీహెచ్ జంగయ్య, ఎస్ శ్రీను, ఎం యల్లమయ్య ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌టీయూ ప్రెసిడెంట్ రాంబాబు